గుంతలమయంగా భౌరంపేట్ ప్రధాన రోడ్డు


భౌరంపేట్ బ్రాడాయి వద్ద రోడ్డు దుస్థితి

దుండిగల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ భౌరంపేట్‌లో ప్రధాన రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. ప్రభుత్వ పాఠశాల ముందు, డివైడర్‌కు ఇరువైపులా పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రధాన రోడ్డుపై నిత్యం కాలనీ ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ గ్రామం ప్రారంభం మొదలుకొని బ్రాడాయి చౌరస్తా వరకు రోడ్డాంతా గోతులమయంగా మారింది. గుంతల కారణంగా ద్విచక్ర వాహనాలు ఏ మ్రాతం అదుపు తప్పినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. బాచుపల్లి సిగ్నల్ నుంచి మల్లంపేట్, శంభీపూర్ గ్రామాల మీదుగా భౌరంపేట్ వరకు 100 ఫీట్ల రోడ్డు వెడల్పు కోసం గత సంవత్సరం కేటీఆర్ చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఈ రోడ్డు బాచుపల్లి నుంచి మల్లంపేట్ వరకు పనులు కొనసాగుతున్నాయి. మల్లంపేట్ దాటిన తరువాత శంభీపూర్ మీదుగా భౌరంపేట్‌కు వరకు రోడ్డు వెడల్పు పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. అధ్వానంగా మారిన భౌరంపేట్ రహదారిని బాగు చేయాలని స్థానికులు, వాహనదారులు అధికారులను కోరుతున్నారు.

ఉగాది వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

రాయదుర్గం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎన్ఎస్‌యూఐ విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి హెచ్‌సీయూలో నిర్వహించే ఉగాది వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వెంకట్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో విద్యార్థులు గురువారం కలిశారు. అనంతరం వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

మనూలో జాబ్‌ఫెస్ట్

హైదరాబాద్‌సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అకాడమీ, ఇండస్ట్రీకి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించేందుకు, చదువు పూర్తైన విద్యార్థులకు ఉద్యోగాలు ఇప్పించేందుకు మనూలో జాబ్‌ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు వీసీ ప్రొఫెసర్ ఐనుల్ హసన్ తెలిపారు. వర్సిటీ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎండీ యూసఫ్‌ఖాన్ ఆధ్వర్యంలో జాబ్ ఫెస్ట్‌ను వీసీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ ఐనుల్‌హసన్ మాట్లాడుతూ.. ఈ జాబ్ ఫెస్ట్‌లో 20 సంస్థలు పాల్గొంటాయని, చివరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ డైరెక్టర్ సాయి ప్రసాద్, యూసఫ్ ఖాన్ పాల్గొన్నారు.

యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కుమార్‌యాదవ్


కుమార్‌యాదవ్‌ను అభినందిస్తున్న సంజయ్

హైదర్‌నగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆల్విన్‌కాలనీ డివిజన్‌కు చెందిన కుమార్‌యాదవ్‌ను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా కుమార్‌యాదవ్ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ సత్కరించారు. ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని సూచించారు.

రెండు వాటర్ ఫిల్లింగ్ స్టేషన్లు ప్రారంభం


ఎల్లమ్మబండలో ఏర్పాటు చేసిన ఫిల్లింగ్‌స్టేషన్

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి జలమండలి పరిధిలో వాటర్ ట్యాంకర్ల బుకింగ్ రోజురోజుకూ పెరుగుతున్నాయి. ట్యాంకర్ బుకింగ్ చేసిన 48 గంటల తర్వాతనే డెలివరీ అవుతుండటంతో ఈ సమయాన్ని తగ్గించేందుకు అధికారులు అదనపు ఫిల్లింగ్ స్టేషన్లపై దృష్టి సారించారు. ఇప్పటికే 11 ఫిల్లింగ్ స్టేషన్ల ద్వారా నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తుండగా.. గురువారం ఎల్లమ్మబండ, బాలాజీనగర్ సెక్షన్ల పరిధిలో మరో రెండు స్టేషన్లను అందుబాటులోకి తెచ్చారు. ఇక వారం రోజుల్లో గాయత్రీనగర్ సెక్షన్ పరిధిలో మరో ఫిల్లింగ్ స్టేషన్ అందుబాటులోకి తెస్తామని జీఎం ప్రభాకరరావు గురువారం తెలిపారు. ఏప్రిల్ ప్రారంభం నుంచి ట్యాంకర్ల బుకింగ్ సంఖ్య పెరుగుతుందని, అదనపు ఫిల్లింగ్ స్టేషన్ల ద్వారా డెలివరీ సమయం తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు.

హోప్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం


మజ్జిగ అందజేస్తున్న విజయ్‌కుమార్

గచ్చిబౌలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నల్లగండ్ల చౌరస్తాలో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ గురువారం ప్రారంభించి మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చందానగర్, నల్లగండ్ల, గచ్చిబౌలి ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కృష్ణ, విజేయందర్‌రెడ్డి, రెడ్డి ప్రవీణ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, మురళి పాల్గొన్నారు.

పాడైన కేబుల్‌ను పట్టించుకోరా?


ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ కేబుల్ వైర్లు పాడైపోయి ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. రంగారెడ్డినగర్ డివిజన్ నుంచి గిరినగర్‌కు వెళ్లే దారిలోని ప్రాగాటూల్స్ ప్రహరీ పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ వైర్లు ఆరు నెలలు నుంచి ప్రమాదకంగా ఉన్నాయి. అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ విద్యుత్ వైర్ల కారణంగా అటుగా వెళ్లే వారికి ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి కేబుల్ వైర్లను బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం


మాట్లాడుతున్న మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశాన్ని ఈనెల 5వ తేదీన కూకట్‌పల్లిలోని ఎస్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నామని నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు తెలిపారు. కూకట్‌పల్లిలోని బీజేపీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో పార్టీ ముఖ్యనాయకులతో సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహేందర్, వడ్డేపల్లి రాజేశ్వరరావు, శ్రీకర్‌రావు, మహిళా మోర్చా నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కిందపడి క్రేన్ ఆపరేటర్ మృతి


మృతి చెందిన జనార్దన్

జీడిమెట్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఓ ఇంజనీరింగ్ పరిశ్రమలో విధి నిర్వహణలో ఉన్న క్రేన్ ఆపరేటర్ కిందపడి తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. వినాయకనగర్‌కు చెందిన జనార్దన్ అనే వ్యక్తి(35) ఇంజనీరింగ్ పరిశ్రమలో క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. గురువారం కంపెనీలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జోరుగా నీటి దందా

- కామునిచెరువులో సుమారు 200 బోర్లు
- భూగర్భ జలాలను తోడేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి
- విద్యుత్ మీటర్లు ఎలా ఇచ్చారు
- ఎమ్మెల్యే కృష్ణారావు


సఫ్దర్‌నగర్ బోరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

అల్లాపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చెరువుల ఎఫ్‌టీఎల్‌లో అక్రమంగా వందల బోర్లు వేసి, జోరుగా నీటి దందా నడుస్తున్నా.. అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహించారు. కాముని, సున్నం చెరువుల్లో భూగర్భ జలాలను తోడేస్తూ.. రోజూ లక్షల రూపాయలను దండుకుంటున్న అక్రమార్కుల పట్ల ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, విద్యుత్ మీట ర్లు ఎవరు.. ఎలా ఇచ్చారని ఆగ్రహించారు. చెరువులను చెరబట్టి నీటిని తోడేస్తున్నారన్న స్థానికుల ఫిర్యాదుల మేరకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కాముని చెరువు పరిసర బస్తీలో బుధవారం పర్యటించిన విషయం విదితమే. ఇదే అంశంపై ఎమ్మెల్యే గురువారం కాముని చెరువు వద్ద నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పుట్ట గొడుగుల్లా వెలసిన బోర్లు, ఫలితంగా చెరువులు ఎండిపోవడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో సమీప బస్తీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో చెరువు నీటిని అక్రమంగా బోర్లు వేసి తోడేయటాన్ని ఎమ్మెల్యే తీవ్రంగా ఆక్షేపించారు. సున్నం చెరువు పరిధిలో వందల బోర్ల ద్వారా నీటి తోడేస్తున్న అక్రమార్కులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్నారు.

అక్రమ బోర్లను తొలగించాలి

కాముని చెరువు పరిధిలో సుమారు 200 బోర్లు ఉన్నాయని అంచనా. ఒక్కో గుడారం వద్ద 4 బోర్ల దాకా ఉన్నాయని, ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్ శాఖాధిరులు బాధ్యతగా వ్యవహరించి అక్రమ బోర్లను నిలువరించాలని కోరారు. కొందరైతే ఒక్కో బోరుకు రూ. 2, 3 లక్షల వరకు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ కాలనీవాసులు తన దృషికి తెచ్చినట్టు కృష్ణారావు పేర్కొన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా, తూ..తూ.. మంత్రంగా చర్యలు చేపట్టి, అక్రమాలను ప్రోత్సహించేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహించారు. చర్యలు తీసుకున్నట్టే తీసుకుని అక్రమార్కులను అదుపుచేయటంలేదని పేర్కొన్నారు. అక్రమంగా వేసిన బోర్లను తొలగించాలని అధికారులను కోరారు.

పత్రాలు లేకున్నా.. విద్యుత్ మీటర్లు

బోర్లువేసి భూగర్భ జలాలను తోడేస్తున్న అక్రమార్కులపై ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ శాఖాధికారులు అక్రమార్కులు అడిగిందే తడవుగా విద్యుత్ మీటర్లు ఇస్తున్నారని, అసలు రూములు లేకున్నా, సరైన పత్రాలు లేకున్నా మీటర్లు ఇచ్చేశారని ఆగ్రహించారు. బుధవారం ఎమ్మెల్యే చేసిన పర్యటనను గమనించి, ఇళ్ల, షటర్లకు తాళాలు వేసి ఉడాయించిన అక్రమ బోర్ల యజమానులు అనంతరమే ప్రత్యక్షమయ్యారని, జడ్‌సీ, ఎమ్మా ర్వో, ఇరిగేషన్, పోలీస్ అధికారులకు ఫోన్ ద్వారా సూచనలిచ్చానని కృష్ణారావు పేర్కొన్నారు. అక్రమబోర్ల వ్యవహారంపై అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. లేదంటే స్థానికులతో కలిసి తాను కూడా ధర్నా నిర్వహిస్తానని హెచ్చరించారు.

అక్రమ బోర్లపై స్పెషల్ డ్రైవ్.. 13 బోర్లు ధ్వంసం


ఖైతలాపూర్ సేవాలాల్‌నగర్ వద్ద బోరును ధ్వంసం చేస్తున్న అధికారులు

కూకట్‌పల్లి: వాల్టా చట్టానికి విరుద్ధంగా బోర్లు వేసి నీటి వ్యాపారం కొనసాగిస్తున్న స్థావరాలపై అధికారుల బృందం కొరడా ఝుళిపించింది. బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ఖైతలాపూర్, సేవాలాల్‌నగర్‌తో పాటు కాముని చెరువుకు ఆనుకొని అక్రమంగా వేసిన 13 బోర్లను అధికారులు గురువారం ధ్వంసం చేశారు. జీహెచ్ఎంసీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖలకు చెందిన అధికారుల బృందం బోర్లను తొలగించే పనులను ప్రత్యేక డ్రైవ్ ద్వారా చేపట్టింది. బోర్లతో పాటు పైపులైన్లను సైతం సిబ్బంది తొలగించారు. అక్రమంగా బోర్లు వేసిన నీటి వ్యాపారాలు చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశామని జెడ్సీ అభిలాష అభినవ్ తెలిపారు. చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.


చౌరస్తాలో నిలిచిపోయిన వాహనాలు

ట్రాఫిక్ సమస్యను పట్టించుకోరా?

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పైప్‌లైన్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. షాపూర్‌నగర్ నుంచి ఎన్‌హెచ్-44 రహదారికి వెళ్లే వే కాంటా సమీపంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సమయంలో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతుంది. మధ్యాహ్నం సమయంలో మండు ఎండలో ఈ ప్రాంతం గుండా పారిశ్రామికవాడకు వెళ్లే కార్మికులు, ప్రయాణికులు ట్రాఫిక్‌జామ్‌ల కారణంగా అవస్థలు పడుతున్నారు. చాలాన్ల మీద ఉన్న శ్రద్ధ ట్రాఫిక్‌ను నియంత్రించడంలో అధికారులు విఫలమవుతున్నారని స్థానికులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్, సిబ్బందిని ఏర్పాటు చెయ్యాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తుక్కుగూడ సభను జయప్రదం చేయాలి

నిజాంపేట్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తుక్కుగూడలో జరిగే భారీ బహిరంగసభకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి కార్యకర్తలు తరలిరావాలని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గాజులరామారంలోని విన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్లో నియోజకవర్గం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ నెల 6న తుక్కు గూడలో నిర్వహించే సభలో కాంగ్రెస్ పెద్దలు ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయనున్నారని హన్మంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, సొంటిరెడ్డి పున్నారెడ్డి, ఎ-బ్లాక్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆర్ లక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రవికుమార్‌యాదవ్

కష్టపడి పనిచేస్తే విజయం

గచ్చిబౌలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో బీజేపీ విజయం కోసం ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేసి పార్టీని గెలిపించాలని శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. బుధవారం కొండాపూర్ మసీద్‌బండలోని పార్టీ కార్యాలయంలో అన్ని డివిజన్ల ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకుల మధ్య మనస్పర్థలు ఉంటే వాటిని పక్కనపెట్టి పార్టీ కోసం పని చేయాలని కోరారు. బీజేపీ కుటుంబసభ్యులుగా కలిసి పనిచేస్తే పార్టీ విజయం తథ్యమన్నారు. నియోజకవర్గంలోని ప్రతి బూత్‌లో 50 మందితో కమిటీలు వేయడం జరిగిందన్నారు. ప్రతి డివిజన్‌లో బూత్‌కమిటీలు ఏర్పాటు చేసి ప్రచారంలో దూసుకుపోతునమన్నారు. కార్యక్రమంలో ఎల్లేశ్, రాజుశెట్టి, నర్సింహ, శ్రీనివాస్, విజయలక్ష్మి, భరత్, అరుణ్ పాల్గొన్నారు.


బాబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్

బోధనలతో సన్మార్గం చూపిన సాయినాథుడు

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తన బోధనలతో సద్గురు సాయినాథుడని ప్రజలకు సన్మార్గం చూపారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని బ్యాంక్ కాలనీ సాయిసహిత హనుమాన్ శివలింగ ఆలయంలో సాయిబాబా విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. గురువారం పూజల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీనివాస్‌రెడ్డిపై ఆరోపణలను వెనక్కి తీసుకోవాలి

కాంగ్రెస్ కార్యకర్తల డిమాండ్, నిరసన, దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

నిజాంపేట్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి భర్త షాడో మేయర్ కొలన్ గోపాల్‌రెడ్డి బుధవారం విలేకరుల సమావేశం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డిపై చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని, శ్రీనివాస్‌రెడ్డి అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం నిజాంపేట్‌లోని హనుమాన్ ఆలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. హనుమాన్ దేవాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. షాడో మేయర్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దని నినాదాలు చేశారు. షాడో మేయర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు, కార్యకర్తలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు నిజాంపేట్‌లో కాంగ్రెస్ జెండా రెపరెపలాడేలా చేసిన నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డేనని, అలాంటి వారి సుచనలు పాటించకుండా, పార్టీ అధిష్టానం అవినీతి ఆరోపణలున్న వ్యక్తిని పార్టీలోకి చేర్చుకోవడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.71.61 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

10 శాతం కమిషన్‌తో సైబర్‌నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు
నలుగురిని అరెస్ట్ చేసిన సైబర్ క్రైం పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కమిషన్‌లకు కక్కుర్తిపడి సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చుతున్న నలుగురు నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. గచ్చిబౌలికి చెందిన పూజారి దామోదర్ అలియాస్ చరణ్, కొండాపూర్ మసీద్‌బండకు చెందిన బి శ్రీకాంత్, కొండాపూర్‌కు చెందిన అంకె శ్రీ చేతన్ అలియాస్ చేతన్, నున్న నరేంద్ర బాబులు 10 శాతం కమిషన్ తీసుకొని సైబర్ నేరగాళ్లు జింగ్, కశ్యప్‌లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చి సహకరిస్తున్నారు. సైబర్ నేరగాళ్లు పార్ట్ టైం జాబ్, పెట్టుబడి పేరుతో మోసాలు చేసి, డబ్బులు వీరి ఖాతాల్లో జమ చేయించేవారు. జమ అయిన డబ్బులో 10 శాతం తీసుకొని, మిగతా 90 శాతాన్ని వారు సూచించిన ఖాతాలకు వీరు పంపేవారు. తిరుమలగిరికి చెందిన వ్యక్తి ఆన్‌లైన్‌లో పార్ట్‌టైం జాబ్‌తో ఆదాయం అన్న ప్రకటన చూశాడు. నిర్వాహకులను సంప్రదించడంతో వారు ఆన్‌లైన్‌లో ఎయిర్ టికెట్‌లు కొనుగోలు చేస్తే కమిషన్‌ల రూపంలో ఎక్కువ ఆదాయం సంపాదించొచ్చని నమ్మించారు. దీని కోసం ప్రత్యేక యాప్‌ను కూడా డౌన్‌లోడ్ చేయించారు. మూడు సార్లు టికెట్ కొనుగోలు చేస్తే, కమిషన్ జమ అవుతుందని చెప్పారు. కానీ రూ.71.61 లక్షలు వెచ్చించి పలు మార్లు టికెట్ కొనుగోలు చేసినా, కమిషన్ మొత్తాలు రాలేదు. అంతే కాకుండా యాప్‌లో విత్‌డ్రా ఆప్షన్ లేకుండా పోవడంతో డబ్బు తిరిగి తీసుకోలేకపోయాడు. పలుమార్లు సంప్రదించినా ఫలితం లేకపోవడంతో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో దామోదర్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీ చేతన్, నరేంద్ర బాబుల ఖాతాల్లో జమ అయినట్లు గుర్తించి వారిని అరెస్ట్ చేశారు. సైబర్ నేరగాళ్లు జింగ్, కశ్యప్‌లపై దేశవ్యాప్తంగా 34 కేసులున్నాయని, అందులో 4 కేసులు తెలంగాణలో నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు అని చెబితే నమ్మొద్దని, కమిషన్లకు కక్కుర్తిపడి సైబర్ నేరగాళ్లకు ఖాతాలు సమకూర్చొద్దని పోలీసులు సూచించారు.

ఎట్టకేలకు జేఎన్‌టీయూ ఫస్టియర్ ఫలితాలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో బీటెక్ ఫస్టియర్ మొదటి సెమిస్టర్ ఫలితాలను అధికారులు ఎట్టకేలకు గురువారం రాత్రి విడుదల చేశారు. జనవరి చివరి వారంలో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించగా, ఫలితాలను వెల్లడించేందుకు అధికారులు రెండు నెలలకు పైగా సమయం తీసుకున్నారు. రిజల్ట్ ప్రాసెసింగ్ విభాగంలో సాంకేతిక సిబ్బంది అకస్మాత్తుగా మానేయడం, ఆ వ్యవస్థలో ఏర్పడిన లోపాలను సరిదిద్దడంలో అధికారులు నిర్లిప్తంగా వ్యవహరించడం ఫలితాల విడుదలలో జాప్యానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. మరోవైపు ఇంజనీరింగ్ కళాశాల వెబ్‌సైట్‌లో ఏర్పడిన నిర్వహణ లోపాల కారణంగా సెమిస్టర్ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు పడాల్సి వస్తోందని బీటెక్ థర్డ్‌ఇయర్ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. సబ్జెక్టులను ఎంచుకున్నాకే పరీక్ష ఫీజు చెల్లించామని, ఫీజు చెల్లించిన విద్యార్థులను తాజాగా మరోమారు సబ్జెక్టులను ఎంపిక చేసుకోవాలని పరీక్షల విభాగం సిబ్బంది ఫోన్లు చేస్తుండడంతో అంతా గందరగోళంగా ఉందన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ ఫలితాలు విడుదల

ఇదిలా ఉంటే.. జేఎన్‌టీయూ యూనివర్సిటీ అఫిలియేటెడ్ కళాశాలలకు సంబంధించి ఎంబీఏ, ఎంసీఏ 3, 4 సెమిస్టర్ రెగ్యులర్/ సప్లిమెంటరీ ఫలితాలను పరీక్షల విభాగం అధికారులు గురువారం విడుదల చేశారు. అలాగే ఎంసీఏ 5వ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలతో పాటు బీటెక్ వన్‌టైమ్ చాన్స్ సప్లిమెంటరీ రీకౌంటింగ్, రీవాల్యుయేషన్ ఫలితాలను కూడా వెల్లడించినట్లు ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ పి.ప్రసన్న తెలిపారు.

కిమ్స్‌లో అరుదైన చికిత్స

16 ఏళ్ల యువతికి మూడు వాల్వ్‌ల మార్పు


యువతితో వైద్య బృందం

రాయదుర్గం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రిలో అరుదైన చికిత్స చేశారు వైద్యులు. మియాపూర్‌కు చెందిన మీనా(16) అనారోగ్యంతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు కిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ఆమెకు పరీక్షలు నిర్వహించి గుండెలోని మూడు ప్రధాన వాల్వ్‌లు మిట్రల్, ట్రైకస్పిడ్, అయోర్టిక్ వాల్వ్‌లలో లీకేజీ ఉందని గుర్తించారు. డాక్టర్ నిసర్గ బృందం 9 గంటలపాటు శ్రమించి మూడు వాల్వ్‌లను మార్చారు. శస్త్ర చికిత్స చేసిన రెండో రోజు నుంచే ఆమె నడవడం మొదలు పెట్టింది.

ఘనంగా స్వరసిద్ధి వేంకటేశ్వరస్వామి శిఖర ప్రతిష్ఠ

మాదాపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ అన్నమయ్యపురంలో స్వరసిద్ధి వేంకటేశ్వర స్వామి వారికి శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేకం కార్యక్రమంలో భాగంగా ఐదో రోజు గురువారం ఉదయం రుత్వికుల సహాయంతో పుణ్యాహవచనం, రత్నన్యాసం నిర్వహించారు. అనంతరం గోదాదేవులు, గరుడ, జయవిజయులు, వినాయక, నాగరాజ, ఆంజనేయ, నటరాజ విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. మహాపూర్ణాహుతి, జీవకళాన్యాసం, గోదర్శనం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సచ్చిదానంద సరస్వతి స్వామి, మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. అన్నమయ్య పాటలపై శోభారాజు కృషిని కొనియాడారు. అనంతరం శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాత్మికవేత్తలు, స్థానికులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మతసామరస్యానికి ప్రతీక

మియాపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం పురస్కరించుకుని హఫీజ్‌పేట ఆదిత్యనగర్‌లోని సెయింట్ ఐజాక్ అడ్వెంట్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన దావత్-ఏ-ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైనదని, మత సామరస్యానికి ప్రతీక అని కొనియాడారు. అందరూ సోదరభావంతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.52 వేల 5 వందల విలువ చేసే బీర్లు, మద్యం బాటిల్స్ పట్టుకున్నారు. ఎన్నికల్లో భాగంగా పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ ప్రధాన రహదారిలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇంద్రజిత్‌శ్యామ్, పోచయ్యలు వాహనంపై రూ.52 వేల 5 వందల విలువ చేసే 21 కేసుల బీర్లు, 4 మద్యం బాటిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కె.విజయవర్ధన్ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మృత్యువాత


సందీప్ (ఫైల్)

అల్లాపూర్: చేపల వేటకు వెళ్లి నీటిలో మునిగి బాలుడు మృతి చెందాడు. 'శాంతి భూషణ్ బ్లెస్ట్ హోం సొసైటీ' బాలాజీనగర్‌కు చెందిన ముగ్గురు పిల్లలు ఐడీఎల్ కుమ్మరికుంటకు వెళ్లారు. సందీప్(13) చేపలు పడుతుండగా పట్టు తప్పి కుంటలో పడ్డాడు. మిగతావారు సందీప్‌ను కాపాడేందుకు ప్రయత్నించగా ఫలించలేదు. డీఆర్ఎఫ్ బృందం సహాయంతో సందీప్‌ను వెలికి తీసేందుకు ప్రయత్నిస్తునట్టు కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతదేహం లభించకపోవటంతో గాలింపు చర్యలు రేపు కూడా కొనసాగనున్నాయని అధికారులు తెలిపారు.

కార్యకర్తను పరామర్శించిన రాజేశ్వర్‌రావు


పవన్‌ను పరామర్శిస్తున్న వడ్డెపల్లి రాజేశ్వర్‌రావు, రామ్మోహన్‌రావు

బాలానగర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బీజేపీ కార్యకర్త, ఫతేనగర్ డివిజన్ రాష్ట్ర ఓబీసీ నాయకుడు రామ్మోహన్ అన్న కుమారుడు పవన్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డెపల్లి రాజేశ్వర్‌రావు గురువారం పరామర్శించారు. కూకట్‌పల్లి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌ను పరామర్శించి డాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

గచ్చిబౌలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ రాజీవ్‌గృహకల్పకు చెందిన ఆంజనేయులు వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరైంది. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా రూ.1.30 లక్షలు మంజూరు కావడంతో చెక్కును నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆంజనేయులకు గురువారం అందజేశారు.

ఎంపీగా లక్ష్మారెడ్డిని గెలిపించాలి: ఎమ్మెల్యే


ఫతేనగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

ఫతేనగర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధిని చూసి ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోట్లాది రూపాయల నిధులతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి దేశంలోనే అగ్రగామిగా నిలిపింది కేసీఆరే అన్నారు. ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూతాడి రాములు, భిక్షపతి, సుదర్శన్‌రెడ్డి, మైనారిటీ నాయకుడు గౌసొద్దీన్, సలావుద్దీన్, సురేందర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాటలను ప్రజలు నమ్మడం లేదు

కూకట్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చే మోసపూరిత హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎగురవేయడం ఖాయమని ఆయన వివరించారు. కూకట్‌పల్లిలోని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్యాలయంలో గురువారం లక్ష్మారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, నాయకుడు గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.